**ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సిఆర్డిఏ)**

**కమిషనర్ వారి కార్యాలయము, లెనిన్ సెంటర్, గవర్నరుపేట, విజయవాడ- 520002.**

**ప్రచురణార్థము**

**తేదీ: 19.04.2025**

## అమరావతిలో "స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర" ర్యాలీలో పాల్గొన్న సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్ గారు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా ఏపీ సిఆర్డీఏ కమిషనర్ కె. కన్నబాబు ఐఏఎస్ గారు ఉదయం నుంచి వెంకటపాలెం, మందడంలోని టిడ్కో గృహ సముదాయాలు, మల్కాపురం, వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు తదితర ప్రాంతాలను సందర్శించారు. అలాగే అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం స్థానిక రైతులు, అధికారులతో రాజధాని అభివృద్ధి పనుల పురోగతి, గ్రామస్తులు వెల్లడించిన పలు సమస్యల పరిష్కారంపై చర్చించారు. అమరావతిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసే లక్ష్యంతో సిఆర్డిఏ చేపడుతున్న కార్యక్రమాలను అధికారులతో కలసి పరిశీలించారు.

ఈ రోజు పర్యటనలో ప్రధానంగా స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా వెలగపూడిలో పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులతో కలసి నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ ర్యాలీ స్వచ్ఛ భారత్ మిషన్ సమన్వయంతో, రాజధాని ప్రాంతంలో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడింది. "స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర" కార్యక్రమ నిర్వహణలో భాగంగా e-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైకిల్ చేయడం' అనే థీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఎంపిక చేసినందున రాజధాని గ్రామాలలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ, చెత్తను డంప్ చేస్తున్న విధానం, చెత్తను జిందాల్ సంస్థకు తరలిస్తున్న వాహనాల పనితీరు తదితర అంశాలను గురించి అధికారులతో కమిషనర్ చర్చించారు. ఈ సందర్భంగా, కమిషనర్..పర్యావరణ పరిరక్షణ, స్వచ్చతా కార్యక్రమాల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే సిటీస్ ప్రాజెక్టు కింద అమరావతిలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ఈ- హెల్త్ కేంద్రాలు, పాఠశాలలను కమిషనర్ సందర్శించారు. ఈ భవనాలలో పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి చేతులమీదుగా సిటీస్ ప్రాజెక్టు కింద నిర్మించిన భవనాలను ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నామని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. సిటీస్ ప్రాజెక్టు కింద అమరావతిలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలు, ఈ- హెల్త్ కేంద్రాలు, పాఠశాలల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా, అలాగే వీటిలో పనిచేసే సిబ్బంది నియామక అంశాలలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

అదే విధంగా, అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ గారు స్వయంగా పర్యవేక్షించారు. ఆయా పనులు చేపట్టిన నిర్మాణ సంస్థల ప్రతినిధులకు కమిషనర్ పలు సూచనలిచ్చారు. రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రాజెక్టులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మూడేళ్ల గడువులోపు ఆయా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే మే 2, 2025న జరగనున్న ప్రధానమంత్రి శ్రీ

నరేంద్ర మోదీ గారి అమరావతి పర్యటన సన్నాహాలను సైతం కమిషనర్ పరిశీలించి, అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ కె. కన్నబాబు ఐఏఎస్ గారు మాట్లాడుతూ, "అమరావతిలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, ఈ రోజు గ్రామస్తులు తెలియజేసిన పలు సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు సిఆర్‌డీఏ  అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో స్వచ్ఛత, సుస్థిర అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రధానమంత్రి మోదీ గారి పర్యటనతో అమరావతి అభివృద్ధి కొత్త ఊపు సంతరించుకోనుందన్నారు. అమరావతి అభివృద్ధి, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సిఆర్‌డీఏ కమిషనర్ పిలుపునిచ్చారు.

ఈ పర్యటనలో సిఆర్‌డీఏలోని వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు, రైతులు, రాజధాని ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కమిషనర్ కార్యాలయం,**

**విజయవాడ.**